

# నివురుగప్పిన శక్తిని వెలికితీసే సంస్థ

గిరిజనులలో దాగివున్న పనితనాన్ని వెలికితెచ్చేందుకు స్వచ్ఛంద సేవాసంస్థ 'శక్తి' కృషిచేస్తోంది. గిరిజన యువతీ, యువకులకు వృత్తి విద్యాకార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి శిక్షణ ఇస్తున్నారు. మారేడుమిల్లిలో కేన్ ఫర్నీచర్ తయారీలోను బూసిగూడెంలో కార్పెంటరీ శిక్షణలోను గత రెండేళ్ళుగా శిక్షణఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గత అక్టోబర్‌లో రంపచోడవరంలో కిత్తనార, గోగునారద్వారా వివిధరకాల వస్తువుల తయారీలో గిరిజన యువతులకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఏజెన్సీ ప్రాంతంలో విరివిగా లభించే ముడిసరుకులతో ఇటువంటిశిక్షణకేంద్రాలు నిర్వహించడం విశేషం. కాగా ఇదేవిధంగా ఏజెన్సీలో ఎక్కువగా పండే కిత్తనార, గోగునారలతో బ్యాగ్‌లు, పర్సులు, వివిధ అలంకార సామగ్రి తయారీలో శిక్షణ ఇస్తోంది. అడ్డతీగల, మారేడుమిల్లి ప్రాంతాల్లో ఎక్కువగా లభించే ఈ కిత్తనారను గిరిజనులే పండిస్తారు. గిరిజనులవద్ద శక్తి సిబ్బంది కిలో పదిరూపాయల చొప్పున నార కొనుగోలుచేసి 15 రోజులు నీటిలో ఉంచుతారు. సోకింగ్ ప్రాసెస్‌ద్వారా నాణ్యతకలిగిన నారను వేరుచేస్తారు. ముదిరిన కిత్తనార ఆకునుండి మూడుగ్రాముల చొప్పున నారవస్తుంది. నార విడదీసిన తర్వాత జడలుగా అల్లుతారు. ఏ వస్తువు తయారుకావాలన్నా జడలద్వారానే చేయవలసి ఉంటుంది.

ఇక గోగునారకే రంగులు వేస్తారు. జడ అల్లకంఅయినతర్వాతవివిధరకాలరంగులు వేస్తారు. జిల్లాలోని సీతానగరంలో ఇటువంటి శిక్షణ కేంద్రం ఖాదీమిషన్‌ద్వారా భారీగా నడుస్తోంది. ఇక్కడ కిత్తనార, గోగునారలద్వారానే కాక అరటినార, తాటి నారలతోకూడా వివిధవస్తువుల తయారీలో శిక్షణఇస్తున్నారు. సీతానగరం నుండి డెప్యుటేషన్‌పై వచ్చిన సూపర్‌వైజర్ శ్రీ కాంతమ్మకురియన్ ప్రస్తుతం ఇక్కడ శిక్షణ కార్యక్రమాన్నిపర్యవేక్షిస్తున్నారు. ఒక సైజు బ్యాగ్ అల్లకానికి 50 నుండి వందమీటర్ల నార అవసరం అవుతుందని స్వచ్ఛంద సేవా సంస్థ శక్తి సహాయకార్యదర్శి శ్రీ డి కన్నయ్య తెలిపారు. ఈశిక్షణ కార్యక్రమంలో పది మంది గిరిజన యువతులు ఉన్నారని గతఏడాదిసీతానగరంలో 18మంది శిక్షణ పొందారని చెప్పారు. వారిలో ఆరుగురుప్రస్తుతంఈకేంద్రంలో కాంట్రాక్టు పద్ధతిపై వస్తువులు తయారు చేస్తున్నట్లు శ్రీ కన్నయ్యచెప్పారు. శిక్షణ పొందుతున్న 10మందికి నెలకు రెండు వందల రూపాయల చొప్పున స్టయిపెండ్ సమగ్ర గిరిజనాభివృద్ధిసంస్థ సహాయంతో చెల్లిస్తున్నట్లు చెప్పారు.

—న్యూస్‌టుడే, రంపచోడవరం.